అన్నదాతకు మళ్లీ నిరాశే!

మాఫీ కానీ బ్యాంకు రుణాలు
- నాలుగో జాబితాలో పేరులేక రైతన్న దిగాలు
- వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన


రెండు లక్షల లోపు రుణాలు మాఫీ

జహీరాబాద్ టౌన్: న్యాల్‌కల్ మండలంలోని రాంతీర్థం గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్థానిక బ్యాంకులో రూ.2.50 లక్షల పంట రుణం తీసుకున్నాడు. రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాలు బ్యాంకుల్లో తిరిగి చెల్లిస్తే రూ. 2లక్షల మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధిక వడ్డీకి అప్పు చేసి రూ. 50 వేలు బ్యాంకులో కట్టాడు. ఇటీవల ప్రభుత్వం నాలుగవ విడత రుణమాఫీ చేయగా లిస్టులో శ్రీనివాస్ పేరు లేదు. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. అలాగే, జహీరాబాద్ పట్టణానికి చెందిన రత్న బ్యాంక్‌లో రూ. 2.50 లక్షల క్రాప్ లోన్ తీసుకుంది. ప్రభుత్వ ప్రకటనతో అప్పు చేసి రూ. 50 వేలు బ్యాంక్‌లో జమచేయగా నాలుగవ విడత లిస్టులో ఆమె పేరు లేదు. ఇలా జిల్లాలో వేలాది మంది రైతులు బ్యాంకుల్లో అధికంగా ఉన్న రుణాలను అప్పులు చేసి చెల్లించి రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. కొంత మంది రైతులు రూ. 4 లక్షల అప్పు చేసి రూ. 2 లక్షలకు పైగా బ్యాంక్‌లో కట్టారు. వారంతా ఆందోళన చెందుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు 6 గ్యారంటీలు ఇచ్చింది. అందులో భాగంగా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. హామీలో భాగంగా నాలుగు విడతల్లో ప్రభుత్వం రుణమాఫీ చేపట్టింది. వందశాతం రుణమాఫీ చేశామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. చాలా మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 2 లక్షల లోపు తీసుకున్న రుణాలను మాత్రమే మాఫీ చేసింది. అధికంగా ఉన్న రుణాలు మాఫీ కాకపోడంతో వేలాది మంది దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. సాంకేతిక కారణాలతో రూ. 2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతుల వివరాలను క్లస్టర్ వారిగా సేకరించి వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. అలాంటి వారి పేర్లు ఇటీవల తాజాగా విడుదల చేసిన నాల్గొవ జాబితా ఉన్నాయి. రూ. 2 లక్షలకు పైగా రుణాల ఉన్న రైతులు పేర్లు లేకపోవడంతో వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఐదవ జాబితా కోసం ఎదురుచూపు..!

రైతు రుణమాఫీ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం నాలుగు విడతలుగా రుణమాఫీ చేసింది. నాలుగు విడతలో వేల మంది అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో రెండు లక్షల పైగా రుణాల ఉన్న సుమారు 35 శాతం మంది రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఐదవ జాబితాలో రూ. 2 లక్షలపైగా ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.



ప్రభుత్వం రూ. 2 లక్షల లోపు తీసుకున్న రుణాలను మాఫీ చేసింది. మాఫీ కాని వారు క్లస్టర్ వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. రూ. 2 లక్షలపైగా ఉన్న రుణాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు.
– భిక్షపతి, ఏడీఏ,జహీరాబాద్

అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కరస్‌గుత్తి రోడ్డు నుంచి కంగ్టి వరకు మూడు కిలోమీటర్ల ఫార్మేషన్ బైపాస్ రోడ్డు పనులకు గురువారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఖేడ్, నిజాంపేట మండలాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫార్మేషన్ రోడ్డుగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డును త్వరలో సీఆర్ఆర్ నిధులతో తారురోడ్డుగా మారుస్తామన్నారు. మంగల్‌పేట్ నుంచి నెహ్రూనగర్ వరకు 70 అడుగుల మేర రోడ్డును విస్తరించి నిరాశ్రయులయ్యే వారికి మండల పరిషత్ సమీపంలో ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని తెలిపారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా మంజీరా నీటిని అందించేందుకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్, కమిషనర్ జగ్జీవన్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, ముఖ్య నాయకులు వినోద్‌పాటిల్, రమేష్ చౌహాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేల కలుషితం కాకుండా చర్యలు

మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్

ఝరాసంగం (జహీరాబాద్): నేల కలుషితం కాకుండా భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన, సజీవవనరుగా అందించడం మన బాధ్యత అని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని సిద్దాపూర్ గ్రామ రైతు వేదికలో మట్టి దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేల కలుషితం కాకుండా సహజ సూక్ష్మజీవుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. విపరీతమైన రసాయన ఎరువులు, పురుగు మందులు, ఇతర రసాయన ఉత్పాదకాల వాడకంతో నేల స్వభావం మారిపోతోందన్నారు. నీటి నిల్వ సామర్థ్యం, పోషకాల లభ్యత నేల స్వభావాన్ని బట్టి ఉంటుందన్నారు. మన మండలంలో నేలల్లో సేంద్రియ కర్బనం తక్కువగా ఉందన్నారు. దీనిని సరిచేయడానికి పచ్చిరొట్ట (జీలుగ, జానుము, పిల్లి పెసర) ఎరువులు వాడాలన్నారు. మన నేలల్లో సూక్ష్మపోషకాల లోపాలు కూడా ఉన్నాయన్నారు. 60 శాతం బోరు బావులు చాలా లోతు నుంచి నీళ్లు తోడడం వల్ల లవణాలు పైకి వచ్చి నేలపై పొరగా ఏర్పడి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుకుమార్, పంచాయతీ కార్యదర్శి వీరన్న, రైతులు రాంరెడ్డి, భద్రారెడ్డి, మల్లారెడ్డి, నవీన్ పటేల్, సుభాష్ రెడ్డి, సంగమేష్, పాపన్న, బాబూమియ తదితులున్నారు.


న్యాల్‌కల్(జహీరాబాద్): సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ


మునిపల్లి: అవగాహన కల్పిస్తున్న ఏఈఓ లావణ్య

నేలల సంరక్షణపై అవగాహన

మునిపల్లి(అందోల్): నేలల సంరక్షణపై వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్య రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని కంకోల్ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పవన్ కల్యాణ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా నేల దినోత్సవం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్, న్యాల్‌కల్, మామిడ్గి, హుస్సెళ్లి ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో గురువారం (మృతిక) నేల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏఓ అభినాష్ వర్మ మాట్లాడుతూ.. అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల నేలలో ఉన్న పోషకాలు నశించిపోతున్నాయన్నారు. ఎరువుల వాడకం అలాగే కొనసాగితే పంటలు పండే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వివిధ కార్యక్రమాల్లో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు అరెస్టు అప్రజాస్వామికం



సంగారెడ్డి : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు


నారాయణఖేడ్: మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

జహీరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్టు అప్రజాస్వామికమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు చేస్తూ బీఆర్ఎస్ నేతలను భయపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రశ్నించే నొకే ప్రయత్నం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి : హరీశ్‌రావు అరెస్టును నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం డౌన్‌డౌన్ అంటూ హరీశ్‌రావును వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను ఆపలేరన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

నారాయణఖేడ్: ప్రతిపక్షాలను ఎదుర్కొలేక ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 9 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలులో విఫలం చెందడం, సమస్యలపై నిలదీస్తారని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

అరెస్టును ఖండిస్తున్నాం..

రాయికోడ్(అందోల్): హరీశ్‌రావు అరెస్టును బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాజీమ్ పటేల్ అన్నారు. మండలంలోని రాయికోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేయడానికి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఉల్టా కేసు పెట్టడం సమంజసం కాదని మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డిని పరామర్శించడానికి వెళ్లిన హరీశ్‌రావును అరెస్టు చేయడం దారుణమన్నారు.

క్లుప్తంగా

పత్తిమిల్లు ఆకస్మిక తనిఖీ


తేమశాతం పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీందర్‌రెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): మండలంలోని చందాపూర్ గ్రామ పరిధిలోని వెంకటేశ్వర పత్తి మిల్లును ఆర్డీఓ రవీందర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలుకు వచ్చిన పత్తిలో తేమశాతం పరిశీలించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. పత్తి రైతులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ సరస్వతి, గిర్దావర్ గంగాధర్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ సెంటర్ పరిశీలన

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లి తండా పంచాయతీ పరిధిలోని పర్వతాపూర్ పోలింగ్ కేంద్రాన్ని గురువారం డివిజనల్ పంచాయతీ అధికారిణి అమృత పరిశీలించారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఆమె పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె రాయిపల్లి తండా పంచాయతీ కార్యాలయం సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంపీఓ సంజయ్‌కుమార్, కార్యదర్శి సంగయ్యస్వామి, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు పట్టణ చేనేత సహకార సంఘం, పద్మశాలి సంఘం సభ్యులు, పెద్దలు గురువారం భూమిపూజ చేశారు. జాతీయ స్థాయిలో డాక్టరేట్ పొందిన శ్రీ దైవాజ్ఞ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు చౌదరి ప్రకాష్, సత్యంగౌడ్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతా ఆనంద్, పద్మశాలి పెద్దలు చింతసాయి, రవి, అంబటి విశ్వనాథం, మనోహర్, వీరయ్య, మధునాల నర్సింలు, మేకల జనార్దన్, పద్మశాలి సోదరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నరేష్‌గౌడ్



జహీరాబాద్ టౌన్: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా జహీరాబాద్‌కు చెందిన నరేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. రెండు నెలల నుంచి ఆన్‌లైన్ విధానంలో యువజన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. బుధవారం రాత్రి ఎన్నికల ఫలితాలను విడుదల చేయగా నరేష్‌గౌడ్ 6 వేల మెజార్టీతో గెలుపొందారు. గురువారం యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మశ్చేందర్



కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బర్ల మశ్చేందర్ ఎన్నికయ్యారు. ఇందిరానగర్ గ్రామానికి చెందిన మశ్చేందర్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి సహకారంతో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు పనిచేస్తానని తెలిపారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లేష



పటాన్‌చెరు టౌన్: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్త గొల్ల మల్లేశ్‌యాదవ్ ఎన్నికయినట్లు యూత్ కాంగ్రెస్ ఎన్నికల నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మొత్తం 20 మంది అభ్యర్థులు పోటీపడగా.. అందులో 1090 ఓట్లతో గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. తన గెలుపునకు కృషి చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులకు రుణపడి ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఉచిత ప్రయాణంతో మహిళలకు లబ్ధి

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత



సంగారెడ్డి టౌన్ : మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి రద్దీ ఎక్కువగా అయిందని, వారికి తగిన విధంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాకు 22 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 29 పల్లె వెలుగు బస్సులను అదనంగా ఏర్పాటు చేశారని వివరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉపేందర్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి, ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో బోరు ఏర్పాటు


బోరు మోటారు ప్రారంభిస్తున్న చంద్రన్న ముదిరాజ్, నరేష్‌గౌడ్ తదితరులు

సాక్షి ఎఫెక్ట్

జహీరాబాద్ టౌన్: రంజోల్ గ్రామానికి చెందిన దాత చందన్న ముదిరాజ్ సొంత ఖర్చుతో బోరు మోటార్‌ను బిగించి బాబానగర్ ప్రజల తాగు నీటి సమస్యను పరిష్కరించారు. నవంబర్ 30 సాక్షి దినపత్రికలో 'నిలిచిన భగీరథ నీటి సరఫరా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. బాబానగర్‌కు మిషన్ భగీరథ బోరు మోటారు చెడిపోవడంతో తాగు నీటి కోసం ప్రజలు అసవస్థలు పడుతున్నారు. బిందెడు నీళ్ల కోసం వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. సాక్షి కథనానికి స్పందించిన ముదిరాజ్ చంద్రన్న సొంత డబ్బుతో బాబానగర ప్రాంతంలో బోరు వేయించి మోటారు బిగించారు. సమస్య పరిష్కారం కావడంతో బాబానగర్ కాలనీ ప్రజలు చంద్రన్నకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, నాయకులు అభిలాష్, శశి, రాజు, మానిక్, వెంకట్ పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు


వృథాగా పోతున్న భగీరథ నీరు

సంగారెడ్డి : అధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్యం వల్ల భగీరథ నీళ్లు వృథాగా పోతున్నాయి. చౌటక్కూర్ మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికి మంచినీళ్లు అందాల్సి ఉంది. మండలం కేంద్రంలో 161 నేషనల్ హైవే రోడ్డు పక్కనే మిషన్ భగీరథ పైపు హెయిర్ వాల్ నుంచి వాటర్ వృథాగా పోతుంది గ్రామాల్లో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. అధికారులు పట్టించుకోక పోవడం ఏంటని వివిధ గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భగీరథ నీళ్ల వృథా కాకుండా చర్యలు ప్రజలు కోరుతున్నారు.

8న క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

పటాన్‌చెరు: క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను 'పై హెల్త్ క్యాన్సర్ హాస్పిటల్ ' సౌజన్యంతో ఉచితంగా నిర్వహించనున్నారు. ఈనెల 8న ఉ.8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సాయిగణేష్ హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసే శిబిరంలో పరీక్షలు చేయనున్నారు. పురుషులకు జనరల్ బాడీ చెకప్, ఊపిరితిత్తుల పరీక్షలతో పాటు, ప్రోస్టేట్ క్యాన్సర్ పరీక్ష కోసం పీఎస్ఏ వంటి పరీక్షలు చేయనున్నారు. మహిళలకు రూ. 6500 విలువైన జనరల్ బాడీ చెకప్, ఊపిరితిత్తుల పరీక్షలతో పాటు, రొమ్ము కాన్సర్ పరీక్షల కోసం మామోగ్రఫీ, సర్వైకల్ క్యాన్సర్ పరీక్ష కోసం పాప్ స్మియర్ పరీక్షలను సైతం ఉచితంగానే చేయనున్నట్లు హాస్పిటల్ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలంలో మొద్దళ్లకుంట తండాలో గురువారం ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఉపాధి పనులు, నిధుల ఖర్చుపై డీఆర్‌పీలు తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీ నివేదికను గ్రామసభల్లో బహిర్గతం చేశారు. ఎస్ఆర్‌పీ మహేశ్, ఏపీఓ శ్యామ్, డీఆర్‌పీలు, టీఏలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలు

సంగారెడ్డి: పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలు, ప్రపంచ నేలదినోత్సవ సందర్భంగా గురువారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అంటే కేవలం ప్రచారం మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. నీటిని వృథా చేయను, చెత్తను చెత్తడబ్బాలో తప్ప ఎక్కడా వేయనని, ఆహారాన్ని వృథా చేయనని మొక్కలు నాటుతానని, చెట్లను నరకకుండా కాపాడుతానని తదితర అంశాలపై అక్కడ ఉన్న స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, యువకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం కప్ 2024 క్రీడాపోటీలపై నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థాయిల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ నుంచి రాష్ట్రస్థాయి వరకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, కోకో, యోగా తదితర క్రీడాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామీణ, మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జట్టులను ఎంపిక చేసి జిల్లాస్థాయికి పంపిస్తామన్నారు. ఆసక్తి కలిగిన ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ


నారాయణఖేడ్: మంత్రి దామోదరను సన్మానించిన ఎంపీ సురేష్ షెట్కార్


నారాయణఖేడ్: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


జహీరాబాద్: జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న గిరిధర్‌రెడ్డి తదితరులు


సంగారెడ్డి: జమంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్, తదితరులు

మంత్రి దామోదర రాజనర్సింహ జన్మదినం సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రముఖులు మంత్రని కలిసి శుభాకాంక్షలు తెలిపి , సన్మానించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కేకకట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త వార్తలు

◆ దరఖాస్తుల ఆహ్వానం

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ హిందీ, ఇంగ్లిష్, పీఈటీ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ గోవింద్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వరి తెలిపారు. ఎంపికైన వారు ప్రస్తుత విద్యా సంవత్సరానికి మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో రెండు రోజుల్లో దరఖాస్తులను అందోల్ కేజీబీవీలో అందజేయాలని చెప్పారు.

◆ యథేచ్ఛగా వ్యర్థ జలాలు విడుదల

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని బెనోవా పరిశ్రమ యజమాన్యం గురువారం ఉదయం పరిశ్రమ గేటు ముందు నుంచి యథేచ్ఛగా రసాయన వ్యర్థ జలాలను వదలడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘాటైన వాసనలతో పాటు వాయు కాలుష్యం నెలకొందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమ వ్యవహారంపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

◆ ఘనంగా సామాజిక వేడుకలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామాజిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రా ల్లో సామాజిక వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ జాతీయ దివ్యాంగుల దినోత్సవం

జిన్నారం (పటాన్‌చెరు): దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లేలా ప్రతి ఒక్కరు సహకరించాలని గుమ్మడిదల ఇన్‌చార్జి ఎంఈఓ రాంబాబు అన్నారు. గురువారం మండలంలో జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అన్నారం, దోమడుగు, బొంతపల్లి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాల్లో జిల్లా దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షుడు నరసింహులు, ఎంఈఓ రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం బొంతపల్లి సమీపంలోని హస్తకళల ఫ్యాక్టరీని సందర్శించారు. దివ్యాంగులు తయారు చేసిన చెక్కబొమ్మలను పరిశీలించి, అభినందించారు. దివ్యాంగ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వ హించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల మేనేజర్ మసూద్, రాష్ట్ర కార్పొరేట్ స్పాన్సర్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ఐదుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

క్రషర్ పనుల నిలిపివేత

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం నల్తూరు గ్రామంలో కంకర క్రషర్ అనుమతులను రద్దు చేయాలని గ్రామస్తుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తడంతో గురువారం జిల్లా మైనింగ్ శాఖ అధికారులు గ్రామంలో పర్యటించారు. రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి మైనింగ్ అధికారి రఘు సర్వే నంబర్ 160లో పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో క్రషర్ల ఏర్పాటు గ్రామంలో వద్దని మైనింగ్ అధికారులకు తేల్చి చెప్పారు. క్రషర్ల లైసెన్స్ అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు మైనింగ్ అధికారులు స్థానికంగా నిర్వహిస్తున్న పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి ఎస్సై నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ జనార్దన్, ఆర్ఐ జయప్రకాష్ నారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.